# శ్రేయోభిలాషి

-జొన్నకూటి మార్టిన్ ఫిన్‌లె

వంటింట్లో గిన్నెలు పడిన చప్పుడు, అటు పై దబ్ మన్న శబ్ధం వినిపించటంతో పడక గదిలోంచి చంద్రం ఒక్క వుదుటన వంటింటి వైపు వెళ్ళాడు. భార్య నేల మీద పడివుంది. కింద పడిన గిన్నెలు నేల మీద అటూ ఇటూ దొర్లుతున్నాయి శబ్ధం చేస్తున్నాయి. 'కాలు జారిపడింది కాబోలు' అనుకుంటూ మీదికి వంగి 'సుజా... సుజా...' అంటూ వీపు తట్టాడు. ఉలుకూ లేదు. పలుకూ లేదు. అదురుని స్పృహ తప్పిందేమో ననుకుంటూ మొహమ్మీద నీళ్ళు జల్లాడు. ఊహూ! అయినా ఫలితం లేదు. చంద్రానికి ఏదో అనుమానం వచ్చింది. అంతే ముచ్చెమటలు పోసాయి. గబుక్కున నేలమీద కూలబడి, భార్య తలను వడిలోనికి తీసుకుని ముక్కు దగ్గర వేలుంచాడు. ఊపిరి తీస్తోంది. 'హమ్మయ్య' అనుకుంటూ కుదుటపడ్డాడు.

ఐతే.. ఐదు నిముషాలు గడిచినా ఆమె స్పృహ లోనికి రాలేదు. అసలేమైవుంటుంది? చంద్రంలో కంగారు మొదలైంది. హాస్పిటల్‌కు తీసుకువెళితే మంచిదేమో... అనుకుంటూ, తలుపు తీసుకుని రోడ్డు మీదికొచ్చాడు. రాత్రిపూట కావడంతో రోడ్డు మీద ఆటో ఒక్కటీ కనిపించలేదు. చంద్రంలో కంగారు మరింత పెరిగింది. 'ఇప్పుడెలా' అనుకుంటూ ఆలోచనలో పడి నిల్చున్నంతలో – దూరంగా వీధి మలుపు దగ్గర ఆటో వస్తూ కనిపించింది. 'థాంక్ గాడ్' అనుకుంటూ ఆటోని ఆపమన్నట్టుగా సైగ చేశాడు.

ఆటోవాడు ఆటోలోంచి తల బయటపెట్టి, "వేరే ఆటో ఏదైనా ట్రై చేయండి సార్. నేను ఇంటికి వెళ్ళిపోతున్నాను" అన్నాడు.

"ప్లీజ్... అర్జంటుగా హాస్పిటల్ పోవాలి" అన్నాడు బ్రతిమాలుతున్న ధోరణిలో చంద్రం.

ఓ క్షణం సాలోచనగా వుండి, "ఏ హాస్పిటల్ సార్" అడిగాడు ఆటోవాడు.

చంద్రం తాము రెగ్యులర్‌గా వెళ్ళే హాస్పిటల్ పేరు చెప్పాడు.

"హాస్పిటల్ అవసరం అంటున్నారు కాబట్టి వస్తాను సార్. కానీ... కిరాయి. అరవై రూపాయలౌతుంది" అన్నాడు.

'అరవయ్యే..' చంద్రం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు.

"అదేమిటి. మేము తరచుగా ఆటోలోనే వెళ్తున్నాము. ఎప్పుడూ ఇరవై ఐదు దాటదు. పోనీ రాత్రి అనుకున్నా ఓ ఐదు అటూ ఇటూ. ఏకంగా నువ్వు డబుల్ చెపుతున్నావే" అడిగాడు చంద్రం.

"మీ ఇష్టం సార్. లేదంటే వేరే ఆటో చూస్కోండి" గేరు మారుస్తూ అన్నాడు ఆటోవాడు.

'రాత్రిపూట.. పైగా హాస్పిటల్ అవసరం.. అదీ వీడి ధీమా! చేసేదేముంది' అనుకుంటూ "సర్లే ఆగు" అంటూ లోపలికి వెళ్ళి రెండు చేతులా భార్యను ఎత్తి పట్టుకుని తీసుకువచ్చి ఆటోలో పడుకోబెట్టి, పోనివ్వమన్నాడు.

ఆటోవాడు గేరు మార్చి ఆటోని ముందుకురికించాడు.

'తలకు కొంచమైనా గాయం కాకుండా స్పృహ ఎల్లా తప్పిందో... హాస్పిటల్‌కు వెళితేగాని విషయం తెలీదు. శ్వాస తీస్తోంది కాబట్టి భయపడాల్సిందేమీ లేదు' అనుకుంటూ స్థిమిత పడ్డాడు చంద్రం.

ఆటో వేగం పుంజుకుంది.

"మీ ఆటోవాళ్ళకు ఆశ మరీ ఎక్కువైపోయిందయ్యా..." అన్నాడు ఎద్దేవాగా.

"ఎందుకు సార్"

"ఓవర్ నైట్ ఓవర్ నైట్ సంపాయించేయాలనే దురాశ. కాకపోతే ఎంత రాత్రిపూట అయితే మాత్రం. మరీ డబుల్ కిరాయా?" ఆటోవాడేం మాట్లాడలేదు. ఉన్నమాట అంటే ఉలికిపాటెక్కువ. ఇంకేం మాట్లాడుతాడు అనుకుంటూ, "అందుకే మీరు ఎంత సంపాదించినా మీ దగ్గర నిలవదు. ఏం లాభం? అడ్డమైన అలవాట్లకీ ఇలా అక్రమంగా సంపాదించిందంతా తగలేస్తారు. అందుకోసం పాసింజర్లని పీల్చి పిప్పి చేస్తారు."

"అందరూ అలాగే వుండరు సార్" అన్నాడు ఆటోవాడు చిన్నగా నవ్వి.

'నిజమే అందరూ నీలాగే వుండరు' స్వగతంలో అనుకున్నాడు చంద్రం.

ఆటో హాస్పిటల్ చేరింది.

ఆటోవాడు సాయంరాగా భార్యని హాస్పిటల్లోనికి చేర్చాడు చంద్రం.

రెణ్నిమిషాల చెకప్ తర్వాత "ఈవిడ బ్లడ్ గ్రూప్..." అడిగాడు డాక్టర్.

"ఎ" ఠక్కున చెప్పాడు చంద్రం.

"ఓ.కె. మీది"

"బి"

డాక్టర్ తల అడ్డంగా ఊపుతూ, "ఏదైనా బ్లడ్ బ్యాంక్‌కి వెళ్ళి 'ఎ' గ్రూప్ బ్లడ్ బాటిల్ ఒకటి తీసుకు రండి. అర్జంట్" తొందర చేశాడు డాక్టర్.

"ఇంతకూ ప్రాబ్లం ఏమిటి డాక్టర్" భయంగా అడిగాడు చంద్రం.

"ఎనీమియా"

అర్థం కానట్టుగా బుర్రగోక్కున్నాడు చంద్రం.

"మెడికల్ టర్మ్స్‌లో ఎనీమియా అంటాం. అంటే రక్తహీనత..." క్లుప్తంగా విడమర్చి "రక్త శాతం పడి పోవడం వల్ల ఆమెకు స్పృహ తప్పింది. త్వరగా 'ఎ' గ్రూప్ బ్లడ్ తీసుకుని రండి. ఊ.. క్విక్" అన్నాడు డాక్టర్.

చంద్రానికి కాలు చెయ్యి ఆడలేదు. "బాటిల్ ఎంత వుంటుంది డాక్టర్" అడిగాడు జేబులో వున్న మొత్తం సరిపోతుందో లేదో అనుకుంటూ.

"ఐదు వందల దాకా వుండొచ్చు. రాత్రివేళ అవసరాన్ని బట్టి కొంచెం అటూ ఇటూ.." చెప్పాడు డాక్టర్.

తలూపి బయటకు రాబోతుంటే.. "సార్ ఒక్క నిముషం..." అంటూ ఆటోవాడు డాక్టర్‌కేసి తిరిగి "సార్ నాది 'ఒ' పాజిటివ్. అది ఏ గ్రూపువారికైనా సరిపడుతుందంటారు కదా" అన్నాడు.

ఔనన్నట్టుగా తలాడించాడు డాక్టర్.

ఆటోవాడు చంద్రం కేసి తిరిగి "సార్ మీక్కావలసిన రక్తాన్ని నేనిస్తాను" అన్నాడు.

చంద్రంకి అభ్యంతరం ఏం కన్పించలేదు. 'ఈ రాత్రి వేళ కావలసిన గ్రూపును వెదుక్కుంటూ బ్లడ్ బ్యాంకుల చుట్టూ తిరగడం కంటె అందుబాటులో వున్న వ్యక్తి నుంచి తీసుకుంటే.. డబ్బు మాటెలావున్నా కనీసం సమయం, శ్రమా ఆదా అవుతాయి' అనుకున్నాడు.

డాక్టర్ నర్సుని పిలిచి రక్తపరీక్షకు ఆదేశించాడు. పది నిమిషాల్లో అన్ని పరీక్షలు పూర్తయ్యాయి. అతడి రక్తం ఏవిధంగానూ హానికరం కాదని, దోష రహితమని తేలింది. ఇక ఆలశ్యం లేకుండా ఓవైపు ఆటోవాడి నుంచి రక్తం తీసుకుంటూనే మరోవైపు చంద్రం భార్యకు రక్తం ఎక్కించే ఏర్పాటు చేశారు.

మరేం పర్వాలేదని డాక్టర్ భుజం తట్టడంతో చంద్రం బయటకు వచ్చి సిగరెట్ వెలిగించాడు.

ఆటోవాడి వల్ల తన పని కొంచెం సులువైనందుకు వాడిపై కాస్త అభిమానం కలిగినా, అంతలోనే వాడి అత్యాశకు వాడి మీద చిరాకేసింది.

ఇప్పుడు దీనికెంత డిమాండ్ చేస్తాడో?

'అసలే బాటిల్ ఐదువందలు.. అవసరాన్ని బట్టి ఎక్కువ డిమాండ్ చేసినా చేయొచ్చు' అన్న డాక్టర్ మాటలు వినివున్నాడు. వీడు కిరాయి విషయంలోనే నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాడు. అలాంటిది ఇప్పుడు అత్యవసర పరిస్థితి. మీకు సమయం ఆదా చేశాను. బ్లడ్ బ్యాంకుల చుట్టూ తిరిగే శ్రమని తద్వారా ఆటో

## నలిమెల నానీలు

**చె**ట్టు నెత్తినిండా
నెత్తుటి పూలు
ఏమిటవి?
అందాల మందారాలు

మూడు రెక్కల పక్షి
ముడుచుకొని పడుకుంది
శీతాకాలంలో
సీలింగ్ ఫ్యాన్

బావి అడుగున
మంట పెట్టారా?
పొగలు కక్కుతున్నాయి
చలికాలం నీళ్ళు

వృక్షాలను
వడిపెడుతున్న కాలం
ఊడుతున్న
యూకలిప్టస్ బెరడు

కొత్తిమీర ఆకుల్ని
ట్రిం చేశారెవరో!
ఆ బుజ్జి కత్తెరను
చూడాలి

మట్టి బ్రెడ్డులే, బెడ్డలే!
భట్టీలో కాల్చారు
ఇంకేం
ఇటుకల దొంతరలు

-డా॥ నలిమెల భాస్కర్

## జరభద్రం

ఇప్పుడు పల్లె లొల్లిలొల్లిగా వుంది
పచ్చిటి పంట పొలాలు ఎండిపోతుంటె.
రైతన్న గుండె చెరువై
బతుకు బరువై
అది రాత్రో పగలో తెల్వదు.
కరెంటు కోసం చూసి చూసి
కాయలు కాసిన రైతన్న కండ్లు
చూడబోతె బాయి నిండా నీళ్లు
నెర్రె బారిన పొలం
మోట తోలిన్నాడు
నికార్సుగ ఓ మడయినా పారేది
ఇంత ముద్ద నోటికందేది.
ఈ వచ్చిరాని కరెంటుకు
పంట చేతికొస్తుందన్న ఆశలేదు.
ఇదివరకయితే
అడివికి పోయినోడు
అన్నలల్ల కల్సినోడు
వస్తడో రాడో అనుకునేవారు
ఇప్పుడు
రాత్రి కరెంటు పెట్టబోయినోడు
నిమ్మలంగ వస్తడో
సావు కబురు సల్లంగ వస్తదో తెల్వదు.
అర్ధరాత్రయినా అపరాత్రయినా
పొలానికి వెళ్లక తప్పదు
తటుక్కున వచ్చి పుటుక్కున పోయె కరెంటుకు
కావలి కాయక తప్పదు.
"రాత్రి పూట పోలీసు పురుగులుంటయి
కరెంటు పాములుంటయి"
"జన బద్రం కొడకా" అన్న అమ్మ మాటలు
"నిమ్మలంగ పోయిరాండ్రి" అన్న ఆలమాటలు
గాలిలో కలిసిపోయి
సావు కబురు సల్లంగ మోసుకొచ్చె

(రాత్రి కరెంటు కాటుకు బలైన రైతన్నల ఆత్మశాంతికి)

**-మేరెడ్డి యాదగిరిరెడ్డి**

ఖర్చులని మిగిల్చాను అంటూ లెక్కలు కట్టి రక్తం ఇచ్చినందుకే కాక అదనంగా ఇంకెంత గుంజుతాడో? ఐదువందలతో ఐతే మటుకు వదలడు. అసలీ లో క్లాస్ జనమే అంత. అలగా జనం. జలగల్లా పీల్చేస్తారు' అనుకున్నాడు.

రక్తం ఇవ్వటం పూర్తయిందేమో... ఆటోవాడు బయటికొచ్చాడు.

"సార్ నా పని పూర్తయింది. రక్తం ఎక్కించడం పూర్తయ్యేసరికి అమ్మగారికి స్పృహ వస్తుందంటున్నారు. కంగారు పడకండి" అన్నాడు.

చంద్రానికి నవ్వొచ్చింది.

'అతడు తన శ్రేయోభిలాషి. కనీసం తన దగ్గర నించి ఓ పెద్ద మొత్తాన్ని చేజిక్కించుకోబోతున్న ఆనందంతోనైనా తన శ్రేయాన్ని కోరుతాడు' అనుకుని నవ్వుకుంటూ, పర్సు తెరిచి, ఐదువందల అరవై రూపాయలు లెక్కించి, అతడి చేతికిచ్చాడు. ఆటోవాడు ఆటో కిరాయి అరవై లెక్కించి జేబులో పెట్టుకుని, చేతిలో ఐదువందల కాగితాల్ని విసురుగా అతడి ముందుకు చాచుతూ "ఇదేమిటి సార్! ఐదొందలు..." అన్నాడు.

"బ్లడ్ బ్యాంక్ రేట్ ఇచ్చాను. ఏం చాలవా? పోనీ ఎంత కావాలి?" అడిగాడు పర్సు తెరుస్తూ చంద్రం. ఆటోవాడు పేలవంగా నవ్వాడు.

"సార్... ఇంటికి పోతున్నవాడిని హాస్పిటల్ అవసరం కనుక కాదనలేక వచ్చాను. ఈ రూట్‌లో ఇంత రాత్రివేళ నాకు పాసింజర్లెవరూ దొరకరు. ఆటోమీద ఆధారపడి బ్రతుకుతున్నవాడిని. పెట్రోల్ ఖర్చులైనా గిట్టుబాటు కావాలి కదా! అందుకే నేను మిమ్మల్ని తిరుగు కిరాయితో కలిపి ఆటో కిరాయి అడిగాడు. దాన్ని మీరు మరోలా అర్థం చేసుకున్నట్టున్నారు. ఆ దేవుడి దయవల్ల 'దానం'గా ఇవ్వాల్సిన దానిని 'ధర' కట్టే స్థితికి నేనింకా దిగజారలేదు సార్. ఆపదలో వున్న సాటి మనిషికి సహాయపడగలిగానన్న తృప్తి కోసమే నేను రక్తం ఇచ్చాను" అంటూ ఐదువందలూ చంద్రం చేతిలో కుక్కి, వడివడిగా గుమ్మం మెట్లు దిగిపోయాడు.

చంద్రం స్థాణువైపోయాడు.

అంతవరకు తను ఆలోచించిన దానికి భిన్నంగా వున్న అతడి ప్రవర్తన... చంద్రానికి మింగుడుపడలేదు.

ఎదుటి మనిషి గురించి సంస్కారవంతంగా ఆలోచించలేని తన కుసంస్కారానికి తనలో తానె సిగ్గుపడుతూ, డాక్టర్ గదిలోనికి నడిచాడు. ■